క్లుప్తంగా

పాకాల సంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న సంతలో సోమవారం వ్యాపారులు, రైతులు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు భోజనం తినకుండా పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే భోజనాల సరఫరా కార్యక్రమాన్ని చేపట్టారని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి కాయల మండీల పరిశీలన

పాకాల: మండల ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ సోమవారం దామలచెరువులోని మామిడి మండీలు, ర్యాంపులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తోతాపురి మామిడి రకానికి రూ.12లకు తగ్గకుండా ఆ రోజు మార్కెట్ ధర ప్రకారం డబ్బు చెల్లించాలని సూచించారు. అలాగే రవాణా చార్జీలు రూ.1 కలిపి ఇవ్వాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో సుబ్రమణ్యం, ఉద్యానవన సహాయకురాలు దేవకి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల గ్రామంలో ప్రమాదానికి గురై మృతి చెందిన మహబూబ్ బాషా కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా చెక్కు సోమవారం సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి అందజేశారు. అగరాలకు చెందిన మహబూబ్ బాషా బండ కాడపల్లిలో బైపాస్ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మే నెల 31న మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. చెక్కును సోమవారం మృతుని భార్య షేక్ బీబీజాన్‌కు అందజేశారు. మృతుని భార్య మాట్లాడుతూ నెల రోజుల్లోనే తమ కుటుంబాన్ని ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు



తిరుపతి మంగళం: రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు సోమవారం తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి మంత్రిని సత్కరించారు. అనంతరం జిల్లాలోని దళితుల సమస్యలు, సంక్షేమంపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మధు, నాగేంద్ర ఉన్నారు.

టీడీపీ నేతకు రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డికి రూ.10 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. వైద్యానికి సాయం చేయాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానంద రెడ్డిని కోరారు. ఎంపీపీ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు భాస్కర్‌రెడ్డికి సోమవారం మంజూరు పత్రం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరంపై అవగాహన

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నుంచి చంద్రగిరి మేజర్ పంచాయతీలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రూప తెలిపారు. ఆమె సోమవారం వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి వైద్య శిబిరంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 56 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వలంటీర్లు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, రామ్మూర్తి, కోటీశ్వర్ రెడ్డి, బండారు చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



గురువు నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న మంగళం తిరుమల నగర్ వాసులు



పూజలు చేస్తున్న సినీ నటుడు మోహన్‌బాబు

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొంకా వీధి, వీవీ మహల్ రోడ్డు, లీలామహల్ రోడ్డు, ఖాదీకాలనీ, ఆర్‌సీ రోడ్డు, శివజ్యోతినగర్, కేశవాయనగుంటలోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

వీరబ్రహ్మేంద్ర ఆలయంలో..

తిరుపతి అన్నారావు సర్కిల్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గురువు ఆశీస్సులు



విశేషాలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి

గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం మంగళం తిరుమల నగర్లోని ఈశానేశ్వర శివాలయంలో గురువులైన కాశేశ్వరానంద సరస్వతికి స్థానిక భక్తులు గురుపూజ నిర్వహించారు. అనంతరం గురువు ఆశీస్సులు అందుకున్నారు.

ఎంబీయూలో..

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రంగంపేటలోని మంచు మోహన్‌బాబు యూనివర్సిటీలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంబీయూ చాన్స్‌లర్, సినీ నటుడు మోహన్ బాబు, ఆయన కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులు, జేసీ బాలాజీ, పలువురు ప్రముఖులు బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వారికి బాబా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, రంగంపేట మహా పుణ్యక్షేత్రంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా చంద్రగిరి మండలం తొండవాడలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి బడిబయట పిల్లలను బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనులు పెంచడంతోపాటు గిట్టుబాటు కూలి కల్పించాలని చెప్పారు. జిల్లాలోని తొట్టంబేడు, డక్కిలి, చిన్నగొట్టిగల్లు మండలాల్లో ఉపాధి పనులు తగ్గాయన్నారు. ఈ సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఈఓ వీ.శేఖర్, లీగల్ సెల్ సీసీ శ్రీనివాస్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీ ఎస్ఈ శంకర్‌నారాయణ, డీఎంహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో వందలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణ అభినందించారు. బాబుసుజన్‌రెడ్డి జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు, మిఖిల్ 71, శశాంక్‌రెడ్డి 90వ ర్యాంకులు సాధించిన విషయం తెలిసిందే. జిల్లా నుంచి ఉత్తమ ర్యాంకులు సాధించి దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, కోర్ డీన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలకు సిద్ధంగా ఉండండి

తిరుపతి తుడా: స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలకు సిద్ధంగా ఉండాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలకు చేయాల్సిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే కొన్ని బృందాలు తిరుపతి నగరాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ బృందం అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. నగరంలోని అన్ని కూడళ్లను సుందరీకరించాలని, డివైడర్ల మధ్యలో రంగురంగుల మొక్కలు నాటి పెయింటింగ్స్ చేయించాలన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, డీఈలు విజయకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

శిరీష కుటుంబానికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి భరోసా



చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మానసిక రోగంతో బాధపడుతున్న చంద్రగిరి మండలం గంగుడుపల్లికి చెందిన శిరీష కుటుంబాన్ని ఆదుకుంటామని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హామీ ఇచ్చారు. గంగుడుపల్లికి చెందిన బండి చెంగారెడ్డి భార్య బండి శిరీష మానసిక రోగంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. రూ.20 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేదని, సాయం చేయాలని హర్షిత్‌రెడ్డికి శిరీష భర్త బండి చెంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు క్రాంతి, రూపసుందర్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. స్పందించిన హర్షిత్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి ఆదుకుంటామని తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీవో రమేష్ బాబు, సర్పంచ్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మన ఆరోగ్యం..మన బాధ్యత

చంద్రగిరి మండలం గంగుడుపల్లి, మండపంపల్లి, దోర్నకంబాల, మల్లయ్యపల్లి, రాయలపురంలో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరాలను సోమవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యవేక్షించారు. సర్పంచ్ ధర్మారెడ్డి, ఎంపీటీసీ విమలమ్మ, క్రాంతికుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గురుమూర్తియాదవ్, రూపసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కమిటీ ప్రమాణం

తిరుపతి కల్చరల్: రోటరీ క్లబ్ తిరుపతి నూతన కార్యవర్గం సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో ప్రమాణ స్వీకారం చేసింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కేవీ.ఫణిరాజకుమార్, ఉపాధ్యక్షుడిగా ఎల్.నాగరాజ నాయుడు, కార్యదర్శిగా సోము రవికుమార్, కోశాధికారిగా పురుషోత్తం ఎస్.పటేల్, డైరెక్టర్లుగా ఎం.పురుషోత్తంరెడ్డి, జి.రాజేష్‌కుమార్, పి.సుదర్శనం రాజు, టెంకాయల దామోదరం, ఎం.హేమచందర్, చైర్‌పర్సన్లుగా 16 మంది ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే రోటరీ యూత్‌గా దొరస్వామిరాజు, శేష సాయి, దిలీప్‌కుమార్, రాజేష్, లావణ్య, హరిత ప్రమాణం చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3191 గవర్నర్ సతీష్ మాధవన్, అసిస్టెంట్ గవర్నర్ ఉషా చక్రాల పాల్గొన్నారు.. అనంతరం రాజేంద్ర శెట్టి, సుధాకర్ రెడ్డి, సోంప్రకాష్, దామోదర గుప్తా ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున విరాళం ప్రకటించారు. అలాగే మట్టా పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నవజీవన్ ఆశ్రమానికి రూ.2 లక్షలు విలువూన నేత్ర పరీక్షల యంత్రం, ఒకటిన్నర లక్షల విలువైన ఇతర వస్తువులు వితరణ చేశారు.

నూతన ఎంఈవోల బాధ్యతల స్వీకరణ



ఎంఈఓకు ఎస్టీయూ నేతల అభినందన



మార్కొండనాయుడు

తిరుపతి ఎడ్యుకేషన్: రేణిగుంట మండలం కరకంబాడి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.బాలాజీ తిరుపతి అర్బన్ ఎంఈఓ-1గా పదోన్నతి పొందారు. ఆయన సోమవారం ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనను యూటీఎఫ్ నాయకులు ముత్యాలరెడ్డి, రామచంద్రయ్య, నిర్మల, మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు ధనుంజయులునాయుడు, మునికృష్ణనాయుడు, మురళీకృష్ణ, ఎస్సీజీఎస్ఎం హెచ్ఎం మునిశేఖర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

రామచంద్రాపురం ఎంఈవో..

రామచంద్రాపురం: మండల నూతన ఎంఈవోగా మార్కొండనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మార్కొండనాయుడు కడప జిల్లా రైల్వే కోడూరు లక్ష్మయ్యగారిపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటసుబ్బమ్మ తిరుపతిలోని చిన్నబజారు స్ట్రీట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా బదిలీ అయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ వీ.మురళీకృష్ణ తెలిపారు. అభ్యర్థి 2020, 2021, 2022లో సాహస కృత్యాలు చేసి ప్రతిభకనబరిచిన వారు అర్హులని పేర్కొన్నారు. http://awardr.gov.inపోర్టల్‌లో వివరాలను పొందుపరిచి ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు హార్డు కాపీని సీఈఓ, సెట్విన్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు 0877-2286921ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సకాలంలో బీమా క్లెయిమ్‌లు ఇవ్వండి

తిరుపతి అర్బన్: వైఎస్సార్ బీమా క్లెయిమ్‌లకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో సంబంధిత సంస్థలకు అందజేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పాలసీదారులు మృతికి సంబంధించి ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్టులను గడువులోపు ఆయా సంస్థలకు అందజేస్తే వారు సకాలంలో చెల్లింపులు చేస్తారని తెలిపారు. నెలలు తరబడి నిర్లక్ష్యం చేస్తే పాలసీదారులకు నష్టం కలుగుతుందని వివరించారు. ఆ మేరకు పర్యవేక్షణ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి సుశీలాదేవి, డీఎల్‌డీవో ఆదిశేషారెడ్డి, డీసీహెచ్ఎస్ మణి తదితరులను ఆదేశించారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు సూచించారు.

శ్రీవారి సేవలో సినీ హీరో ధనుష్



సినీ నటుడు ధనుష్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం సినీ హీరో ధనుష్ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నటుడు ఎస్వీఆర్‌కు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక చిత్రాలలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఎస్వీ.రంగారావుకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులర్పించారు. ప్రైవేటు హోటల్లో ఎస్వీఆర్ 105వ జయంతి సభ నిర్వహించారు. కళాకారుడు కె.సుబ్రమణ్యంరెడ్డి, ఫరీద్‌బాబాను జ్ఞాపికలతో సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ

తిరుపతి కల్చరల్: పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి గోవిందరాజస్వామి గరుడసేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రతి నెలా పౌర్ణమి పర్వదినాన గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు గరుడిడుని అధిరోహించి ఆలయ ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయులు పాల్గొన్నారు.

వేదమంత్రాలతో దైవానుగ్రహం

తిరుపతి కల్చరల్: వేద మంత్రాలతో దైవానుగ్రహం లభిస్తుందని ఎస్వీ వేద వర్సిటీ వేద విభాగం డీన్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర ఘనాపాఠి ఉద్ఘాటించారు. టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని మైదానంలో చేపడుతున్న శ్రీనివాస చతుర్వేద హవనం సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాత్రి 7 గంటలకు ఆచార్య ఫణియజ్ఞేశ్వర ఘనాపాఠి వేద మంత్రాలు -పరిరక్షణ అనే అంశంపై ఉపన్యసించారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు డాక్టర్ ఎస్.ఉషారాణి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీటీడీ ఎఫ్ఏసీఏవో బాలాజి, హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ప్రోగ్రాం అధికారి ప్రశాంతి, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



గురువులతో పూర్వ విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో 50 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన విద్యార్థులు సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా సమావేశమయ్యారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పించిన గురువులు రఘునాథరెడ్డి, సంపత్, క్రిష్ణారెడ్డి, రామ్మూర్తి, నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్పందనలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ఆదేశించారు. ఆమె సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. టెక్నికల్, లీగల్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సమస్యపై తరచూ అర్జీలు వస్తే సంబంధిత శాఖ అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నగరంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ శ్రీనివాస సేతు వంతెన కింద బీటీ రోడ్లు వేయాలని, శ్రీనివాస సేతు వంతెన పైన స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని, కపిలతీర్థం కూడలిలో కొత్తగా నిర్మిస్తున్న భవనానికి పబ్లిక్ టెండర్లు పిలవాలని కోరారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్కె.బాబు మాట్లాడుతూ ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ వద్ద నిర్మించే రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికు తగిన మొత్తాన్ని రైల్వేకు వెంటనే చెల్లించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, సెక్రటరీ రాధిక, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యం



పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె. బాబు, కార్పొరేటర్ ఆంజనేయులుతో కలిసి తిరుపతి నగరం 12వ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి ప్రజలకు ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు. ఫ్రీ లెఫ్ట్‌లతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.కె.బాబు మాట్లాడుతూ తమ డివిజన్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, అంకాలమ్మ గుడి నుంచి ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ వరకు తారు రోడ్డు నిర్మించినందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంకాలమ్మ గుడి ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ సంజీవ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటమునిరెడ్డి, హరినాథ్, మురళీ, రమేష్ రెడ్డి, కుమార స్వామి, జ్ఞానకుమార్, శేఖర్, రఫీ హిందుస్థాని పాల్గొన్నారు.

రేపు పాఠశాలల బంద్

తిరుపతి కల్చరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ చేపడుతున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యదర్శి ఎస్.హరికృష్ణ తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పాఠశాలల బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తూ పిల్లల తల్లిదండ్రులను దగా చేస్తున్నారని విమర్శించారు. టెక్నో, సీబీఎస్ఈ సిలబస్, ఇంటర్నేషనల్ స్థాయి గుర్తింపు అంటూ మభ్య పెడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. పట్టించుకోకపోవడంతో రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు వివరించారు. వై.సురేంద్రబాబు, ఎస్.పవన్ కుమార్, జితేంద్ర పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న స్కూటర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరికి సమీపంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం స్కూటర్ డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలం గొల్లపల్లికి చెందిన సిద్ధేశ్వరాచారి ఐరాలలో కార్పెంటర్ షాపు నిర్వహిస్తున్నాడు. తిరుపతిలో ఒక ఇంటికి తలుపులు బిగించేందుకు గొల్లపల్లికి చెందిన రామ్మూర్తిని తీసుకుని స్కూటర్‌పై బయలుదేరాడు. చంద్రగిరి హైవే బ్రిడ్జి పైన స్కూటర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. సిద్ధేశ్వర ఆచారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రీయ పద్ధతులతోనే నాణ్యమైన పరిశోధనలు

తిరుపతి ఎడ్యుకేషన్ : శాస్త్రీయ పద్ధతులతోనే పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ (ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ) డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ సంయుక్తంగా మహిళా వర్సిటీలో చేపట్టిన ఏడు రోజుల ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ వుమెన్ పీహెచ్‌డీ స్కాలర్స్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఇన్ సౌత్ ఇండియా సదస్సు సోమవారం ప్రారంభమైంది. మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.అనూరాధ అధ్యక్షత వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రకాల పథకాలు, ప్రాజెక్టులతో ఔత్సాహిక టీచర్లను, రీసెర్చ్ స్కాలర్లను ఐసీఎస్ఎస్ఆర్ ప్రోత్సహిస్తోందని తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ డి.జమున మాట్లాడుతూ పరిశోధనలు, పబ్లికేషన్స్ ఎన్ని చేశామన్నది ముఖ్యం కాదని, వాటిలో నాణ్యతే ముఖ్యమని తెలిపారు. మంచి ఇండెక్స్‌డ్ జర్నల్స్‌లో పబ్లికేషన్స్ చేసేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని మాట్లాడుతూ అభివృద్ధికి దోహదపడే అంశాలపై అవగాహన ఏర్పరచుకోవడానికి విస్తృత పరిశోధనలు అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, మాధవి, ఇందిరా, అనూరాధ, నీరజ, లత, రూప, పీఆర్ఓ ఎస్.రజని, వివిధ రాష్ట్రాల నుంచి 35 మంది పీహెచ్‌డీ స్కాలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగం బలోపేతం



నాటా ప్రతినిధులతో ఎస్‌డీహెచ్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన విద్యావిధానం, అనేక విద్యా సంస్కరణలతో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతమైందని ఎస్‌డీహెచ్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి తెలిపారు. అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) మహాసభలు జరిగాయి. ఇందులో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు, అమలుచేస్తున్న విభిన్న పథకాల గురించి వివరించారు. తద్వారా విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని, విద్యా సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని వివరించారు. ఆయనను నాటా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. నాటా వ్యవస్థాపకులు ప్రేమసాగర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శరత్ మండపాటి తదితరులు పాల్గొన్నారు.